స్వాతి వారపత్రిక, మే 21, 1998

"యాభై నిండాయి. ఇంకా నావంక ఆ చూపులేమిటి?
అబ్బాయికి పిల్లను చూడండి - అందామె భర్తతో"

# యాభై ఏళ్ళ వయసు

"ఇదిగో - ఇంకా ఎంత సేపు?" అన్నాను విసుగ్గా. "అయిపోయింది - రెండు నిముషాలు!" అంది శ్రీమతి. నేను మనిషిని కావడంవల్ల అడిగినప్పుడల్లా నా పలుకులో ఒక్కోరసం చిందింది. పదోసారి అడిగేసరికి మాత్రం నవరసాలూ అయిపోవడం వల్లనేమో విసుగొక్కటే ధ్వనించింది.

స్విచ్ ఏ ఉద్రేకంతో నొక్కినా టేపురికార్డర్ స్వరం ఒక్కలాగే పలికినట్లు నా శ్రీమతి పదిమార్లూ నా ప్రశ్నకి ఒకే తరహా నిర్లిప్తతతో బదులిచ్చింది. అందులో కోపం, విసుగు, భయం, సంజాయిషీ లాంటివేం లేవు. స్వరం ఆరోహణావరోహణల్లో ఎక్కడామార్పు లేదు. మొదటిసారి బదులిచ్చినపుడు టేపుచేసి మిగతా మార్లదే వినిపిస్తున్నట్లుంది. మరామె మనిషో, యంత్రమో!

పక్కవీధిలో పెళ్ళికని మా ప్రయాణం. రెండు గంటల క్రితం పడక గదిలోకి వెళ్ళి తలుపులేసుకుందామె. ఇంట్లో మేమిద్దరమే వున్నాసరే - బట్టలు మార్చుకోవాలంటే ఆమె తలుపులేసుకుంటుంది. అలాగని సిగ్గనుకునేందుకూ లేదు. నలుగురూ ఉన్నప్పుడేమోకానీ మేమిద్దరమే ఉన్నప్పుడామెను సిగ్గుపడగా చూసి దశాబ్దాలు దాటింది.

"వయసొస్తోంది కానీ మీలో కుర్రచేష్టలు పోలేదు. నేను తలుపులేసుకోకపోతే ఈ వేళ్టికి మనం తెమిలినట్లే!" అంటుందామె. అలా అన్నప్పుడామెలో సిగ్గు, శృంగారభావాలు, చిలిపితనం, తొందరగా తెమలాలన్న తపన వంటివేం కనిపించవు.

బటన్ నొక్కితే కంప్యూటర్లో కమాండ్ వచ్చినట్లు - తలుపులేసుకునే ముందు ఆమె నుండి ఏ భావమూ ధ్వనించకుండా ఈ సంజాయిషీ వస్తూంటుంది.

"నా వయసువాళ్ళు సినిమా హీరోలుగా ఒకే సినిమాలో ఇద్దరు ముగ్గురు హీరోయిన్లతో చెట్టా పట్టాలు వేసుకుని గెంతుతున్నారు. అప్పుడే నాకు వయసు రావడమేమిటీ?" అని శ్రీమతిని నిలదీస్తే, "మీరూ వాళ్ళకిలా కనబడాలంటే జుత్తుకి

నల్లరంగు వేయకపోయినా గోరింటాకు పెట్టుకోండి. తెల్లజుత్తు కనబడదు" అంటుంది.

ఆధునికత ప్రభావమో ఏమో ముప్పై ఏళ్ళకే నా తలమీద మొదటి తెల్ల వెంట్రుక కనబడి - ఏకాంతంలో ఉండలేనన్నట్లు క్రమంగా తోడును పెంచుకుంది. నా జుత్తు ఒత్తయినది కావడం వల్ల నూనె రాసుకుంటే అవి కనిపించేవి కావు. తలంటుకున్నప్పుడు మాత్రం కాసేపు ఎవరికీ కనిపించకుండా ముఖం చాటేసేవాణ్ణి. కానీ - అలా ఎంత కాలం? చెంపలు కూడా కాస్త నెరిసేసరికి శ్రీమతి నల్లరంగు ఒత్తిడి తేసాగింది.

శ్రీమతి మరీ చిన్నపిల్లలా ఉండదు కానీ నాకంటే బాగా చిన్నదిగా కనబడుతుంది. నేను కుర్రాడిలా కనిపిస్తే తను ఆ కుర్రాడి పెళ్ళాంగా చెలామణీ అయిపోతానని ఆశ. ఆమెతో పోలిస్తే నాకు వళ్ళు, పొట్ట కూడా తక్కువే! ఉన్నదల్లా అక్కడక్కడ తెల్లజుత్తు. దానిగురించే శ్రీమతి పట్టు!

నేను మాత్రం ఆమె ఎంత చెప్పినా తెల్లజుత్తును పట్టించుకోలేదు. నాలో కుర్రతనపు ఛాయలేం పోలేదు. నడిచే ఓపిక తగ్గలేదు, కనీసం నడకలో వేగం కూడా తగ్గలేదు. ఆఫీసులో జరిగే బాడ్మింటను పోటీల్లో ఇప్పటికీ నేనే ఫస్టు. నా ముఖంలో ముడతల్లాంటివి ఏర్పడలేదు.

ఇవన్నీ అలా ఉంచితే ఓసారి రైలు ప్రయాణంలో ఓ అందమైన అమ్మాయి పక్కపిల్లతో మాట్లాడుతూ, "తలమీద అక్కడక్కడ తెల్లజుత్తున్న మగాళ్ళు చాలా చాలా డిగ్నిఫైడ్‌గా కనిపిస్తారు. అలాంటి వాళ్ళంటే నాకు ఇష్టం" అంది. ఆమె నన్ను చూసే ఆ మాట అన్నదన్న నమ్మకంతో అప్పట్నించీ నేను నా డిగ్నిటీని కాపాడుకుంటూ వస్తున్నాను...

ఈ రకంగా ఆలోచిస్తూ ఉన్నట్లుండి టైము చూసుకుని ఉలిక్కిపడిపోయి, "ఇదిగో - ఇంకా ఎంతసేపు?" అన్నాను అసహనంగా.

"అయిపోయింది - రెండే రెండు నిముషాలు!" అంది టేపురికార్డరు.

నా అసహనానికి అసహాయత తోడై ఉక్రోషం వచ్చింది. ఆ రోజు పెళ్ళిలో ఆడపిల్లల్ని నా చుట్టూ తిప్పుకుని శ్రీమతిని ఉడికించాలనుకున్నాను. తలచుకుంటే ఆడపిల్లల్ని ఆకర్షించగలనని నాకో నమ్మకముంది. ఇన్ని దశాబ్దాలుగా నేను గట్టిగా తలచుకున్న సందర్భం ఒక్కటీ లేకపోవడం చిత్రమే! ఆ చిత్రమే నా నమ్మకాన్నింకా కాపాడుతోంది.

ఈ రోజు నా నమ్మకాన్ని పరీక్షకు పెట్టి తీరాలనుకున్నాను. అందుకు వయసును మర్చిపోవాలి కదా అనుకుంటూండగా - సరిగ్గా అప్పుడే కాలింగ్‌బెల్ మ్రోగింది. కాసేపు వచ్చినవారితో కాలక్షేపమైనా చెయ్యొచ్చని ఆశపడుతూ వెళ్ళి తలుపుతీస్తే కొరియర్లో గ్రీటింగ్సు. గ్రీటింగ్సు అబ్బాయి పంపాడు. నాకు ఏభై నిండాయని ప్రత్యేకంగా!

అబ్బాయి ఉత్తర హిందుస్థానంలో ఉంటున్నాడు. రజతోత్సవ జన్మదినం చేయాలని మేమనుకుంటున్నాం. నేను వాడి వయసు లెక్కవేస్తున్నట్లే వాడు నా వయసును లెక్క వేస్తున్నట్లున్నాడు. రెండ్రోజులు ముందే అందేటట్లు పంపాడు గ్రీటింగ్సు.

కార్డు బాగుంది. ఇంగ్లీషు మీడియం కుర్రాడైనా "స్వర్ణోత్సవ జన్మదిన

శుభాకాంక్షలు" అంటూ  ఓ తెలుగు ముక్కనుకూడా అందులో చక్కగా ఇరికించాడు. అప్పుడే నేను పెళ్ళిలో ఆడపిల్లల్ని నా చుట్టూ తిప్పుకోవడం గురించి ఆలోచించానేమో ఈ గ్రీటింగ్సు నన్ను ఛెళ్ళున కొట్టినట్లయింది.

వీధి తలుపు వేస్తుంటే - "ఎవరండీ?" అంది గదిలోంచీ శ్రీమతి.

"చెబుతాను - రెండు నిముషాలు" అన్నాను కసిగా.

రెండు నిముషాలంటే ఆమెకు తెలిసినట్లుగా ఎవరికి తెలుస్తుందీ - అందుకే భళ్ళున తలుపులు తెరుచుకున్నాయి.

నేను గ్రీటింగ్సు విషయం చెప్పకుండా సస్పెన్సులో పెట్టి శ్రీమతిని ఏడిపించాలను కున్నాను. కానీ తలుపులు తెరుచుకోగానే -

చిలకాకుపచ్చ రంగు చీర కట్టింది. అదే రంగు బ్లౌజు. రెండు గంటల టైము వృధా పోలేదు. చీరకట్టు ఆమె శరీరానికి మెరుగులు దిద్దింది. ఆమె ముఖం మేకప్ తేజంతో మెరిసిపోతూంటే నుదుట కుంకుమ తిలకం పగడంలా వెలుగుతోంది.

నిత్యం చూసే మనిషే అయినా అప్పుడప్పుడామె నాకలా కనిపించి స్పృహ తప్పిస్తూంటుంది. నిశ్చేష్టుడినై ఉన్న నన్ను సమీపించి చేతిలోని గ్రీటింగ్సందుకుని, "యాభై నిండాయి. ఇంకా ఆ చూపులేమిటీ? అబ్బాయికి పిల్లను చూడండి" అందామె.

ఆమె మళ్ళీ నాకేదో అందిస్తూంటే గ్రీటింగ్సే అనుకున్నాను. కానీ అందుకున్నది చాలా బరువుగా ఉంది. తమకంలో ఆమెనే అందుకున్నానా అనుకుంటే అది మరీ అంత బరువులేదు. ఉత్సాహంలో నా శక్తి పెరిగి శ్రీమతిని తేలికగా ఫీలవుతున్నానా అనుకుని చేతిని కాస్త పైకెత్తబోతే పైకి లేవలేదు.

యాభై ఏళ్ళ వయసుకదా - శ్రీమతి అందించిన సూట్‌కేసు చిన్నదైనా ఎంతో పైకి ఎత్తలేకపోయాను. అయితే నేనామెను ఆ పెట్టెలో ఏమున్నాయని అడగలేదు. అందులో ఆమె పెళ్ళి సమయంలో పలు సందర్భాల్లో మార్చుకునేందుకు పట్టుచీరలు వుంటాయని నాకు తెలుసు.

✦ ✦ ✦

పువ్వుల్లా నవ్వుతూ, సెలయేళ్ళలా గలగలలాడుతూ, సీతాకోకచిలుకల రంగులలో గాలిలో తేలుతూ, లేడికన్నుల బెదురుచూపులలో యువక హృదయాలను గగ్గోలెత్తిస్తూ - ఒకరు కాదు, ఇద్దరుకాదు - ఎందరో యువతులు పెళ్ళి వేడుకకు శోభనిస్తున్నారు.

సినిమాల్లో ఎందరు ఆడపిల్లలున్నా - కెమేరా ఓ పిల్లను పట్టి హీరోయిన్ని చేస్తుంది.

పురుషుడి కళ్ళు కెమేరాలాగే పనిచేస్తూండడంవల్లనే సృష్టి క్రమంగా నడుస్తోంది. ప్రస్తుతం నా కెమేరా కన్ను ఓ అమ్మాయిని ఎన్నుకుంది. సుజాతా అంటే ఆమె పలుకుతుందని నేను గమనించాను. 'యాభై ఏళ్ళొచ్చాయి. ఇంకా ఆ చూపులేమిటీ? అబ్బాయికి పిల్లని చూడండి' అన్న శ్రీమతి హెచ్చరికనందుకున్న నా మెదడు ఇచ్చే సంకేతాలు నా చూపుల్లో ప్రతిఫలించి నేను సుజాతలో కోడల్ని చూస్తున్నాను.

ఆ పిల్ల అబ్బాయికి ఈడూ, జోడుగా ఉంటుంది. అందం, రంగు, పొడవు, పర్సనాలిటీ, చలాకీతనం.... ఒక్కటేమిటి.... అన్నీ అనుకూలంగా ఉన్నాయి. ఇది తేల్చుకుందుకామెను చాలాసార్లు రెప్పలార్పకుండా చూశాను. యాభైఏళ్ళ వయసు కాబట్టి నన్నెవరూ అనుమానించరు కానీ సుజాత నా చూపులు గమనించి కాస్త ఇబ్బంది పడ్డట్లే అనిపించింది. ఆమె ఇబ్బంది నాకు ముచ్చటగా ఉంది.

అబ్బాయి తండ్రిని - సుజాత విషయాన్ని ఎవరిద్వారా కదపాలా అని ఆలోచిస్తూండగానే - ఉన్నట్లుండి సుజాత ఉప్పెనలా నా దగ్గరకొచ్చి, "మీరొంటరిగా ఎప్పుడు దొరుకుతారా అని చూస్తున్నాను - నాకేసి అంతలా ఎందుకు చూస్తున్నారని నిలదీయాలని!" అందామె కోపం, విసుగు ధ్వనించని ఫిర్యాదుచేస్తూ. ఆ గొంతు వీణలా మ్రోగింది. పాటలు పాడుతుందేమో - అబ్బాయికి పాటలంటే ఇష్టం!

ఆమె ఆరోపణకు తిరుగులేని బదులివ్వాలనుకుని - మగపిల్లాడి తండ్రినన్న అహాన్ని తాత్కాలికంగా జయించి, "మా అబ్బాయికి సంబంధాలు చూస్తున్నాం. నీవంటి పిల్ల కోడలైతే బాగుంటుందనిపించింది" అంటూ బాంబు పేల్చాను.

సుజాత ఒక్కక్షణం మాత్రం తడబడి అంతలోనే తేరుకుని, "ఏమిటీ - మీకు పెళ్ళీడు కొడుకున్నాడా - ఐకాంట్ బిలీవిట్!" అని వెళ్ళిపోయింది.

ఈ అభినందనకు నేను సిద్ధంగా లేను కాబట్టి నా పక్కన బాంబు పేలింది. ఆమె మాటలను మననం చేసుకుంటూ కాసేపక్కడే ఉండి పోయాను.

సుజాత మాటలకు అర్థం దొరక్కపోయినా అద్దంలో నన్ను నేను చూసుకోవాలని పించి మనోదర్పణాన్ని నా ముందు నిలబెట్టాను. ఆ అద్దంలో నన్నింకా నేను చూసుకుంటూనే ఉన్నాను.

అంతలోనే సుజాత మళ్ళీ వచ్చి, "మీ అబ్బాయి వివరాలు తెలుసుకుని వచ్చాను. మామూలుగా అయితే ఈ పెళ్ళికి ఒప్పుకునేదాన్నేమో - కానీ ముందు మిమ్మల్ని చూశాను" అంది.

షాక్ తిన్నాను. ఈమారు సుజాత మాటల్లో అర్థం వెతుక్కునే పనే లేకపోయింది.

చాలా సూటిగా నన్ను తను తొలిచూపులోనే ప్రేమించినట్లు చెప్పింది. అందువల్ల నా పుత్రరత్నం ఆమెకూ కొడుకుతో సమానంట!

ఆమె కన్నుల్లోంచీ వెన్నెల కురుస్తూంటే, పెదాలు వీణలు మ్రోగిస్తూంటే ఆమె నన్ను ఆటలు పట్టిస్తోందా అని అనుమానించడానికి ఆస్కారమేదీ?

"మీరెప్పుడూ ఫుల్‌సూట్లో ఉండండి. సింప్లిసిటీ మీకు నప్పదు" అంటూ ఆమె అప్పుడే నా దుస్తుల గురించి ఆర్డరు చేస్తే ఆదిలోనే ఇలాంటివి త్రుంచేసి ఆమెకు నాపై విరక్తి కలిగించాలనుకుని, "డ్రస్ విషయంలో నా అభిప్రాయాలునావి. అందుకు ప్రియురాలి మాటకూడా మన్నించను" అన్నాను.

సుజాత రవ్వంతకూడా చలించకుండా, "మగాడికి వ్యక్తిత్వం ముఖ్యం. హిపోక్రసీ లేని మీరు నాకు నచ్చారు" అని అంతటితో ఊరుకోక, "మీ పేరు చలపతి కాబట్టి

మిమ్మల్ని చాలూ అంటాను" అంది చాలూ అంటే కొంటెవాడన్న ధ్వనితో.

"చాలూ! నాకేం పాలుపోవడంలేదు. ఎంతో ఆలస్యంగా పుట్టడం నా దురదృష్టం. ఇప్పుడు మీ ఇంట్లో ప్రవేశించి మీ సంసారంలో నిప్పులు పోశానన్న నిందను భరించడం నావల్లనవుతుందా?"

- అని ఆమె అప్పుడే చాలాదూరం వెడుతూంటే నాకు మాత్రం చాలూ అన్న పిలుపులోని మాధుర్యమొక్కటే తెలుస్తోంది.

చివరికామె, "నేను ఉమెన్స్ లిబ్‌ను నమ్ముతాను. పాతికేళ్ళు దాటేదాకా పెళ్ళి గురించే ఆలోచించను. అంతవరకూ లైఫ్ ఎంజాయ్ చేస్తాను. నా అభిప్రాయంలో ఎఫైర్ తప్పుకాదు. కానీ మిమ్మల్ని చూసేదాకా ఎఫైర్ మాటే నాకు తోచలేదు" అనేసరికి తెల్లబోయాను. ఆమె మరీ ఇంత పచ్చిగా మాట్లాడుతుందనుకోలేదు.

సినిమాలు, పత్రికలు ఈ పిల్లను బాగా చెడగొట్టాయి. ఈమెను నేను కోడలుగా చేసుకునే ప్రసక్తి ఇక లేనే లేదు. అయినా ఈమెను మంచిదారికి మళ్ళించడం నా బాధ్యత అనిపించింది. అందులోనూ నన్ను ప్రేమించానంటోంది.

నేనిలా మొదలెట్టానో లేదో, "వ్హాట్ చాలూ! మీరూ అందరిలా మాట్లాడితే ఎలా? లెటజ్ బి గుడ్ ఫ్రెండ్స్! మనం రోజూ ఇందిరాపార్కులో సాయంత్రం ఆరింటికి కలుసుకుని ప్రేమకబుర్లు చెప్పుకుని ఎంజాయ్ చేద్దాం. అందుకు శ్రీకారం రేపే! అయితే చిన్న రిక్వెస్ట్. ఆడదానికి దాగని వయసు అందం. మగాడికి వయసు దాస్తే అందం.

మీ తలకు గోరింటాకు పెట్టుకోండి. ఎర్రజుత్తు మీకెంతో నప్పుతుంది. నాకోసం ఈమాత్రం చేస్తే చాలు, చాలూ!" అంది.

అప్పటికి సంభాషణ ఆగిపోయింది.

సుజాతను మంచిదారికి మళ్ళించడానికి - నేనామెను రోజూ పార్కులో కలుసుకోవడం తప్పదని మనసు ప్రబోధించింది.

మా పెరట్లోనే గోరింటాకు చెట్టుంది. నేనడగ్గానే పనిమనిషిచేత గోరింటాకు కోయించి, మిక్సీలో రుబ్బి - ఆ ముద్దను పల్చటి నా జుత్తుపై పామి - రెండు గంటల అనంతరం నా చేత తలంటు స్నానం చేయించి, "ఎంత బాగున్నారండీ - ఈరంగు మీ జుత్తుకు బాగా నప్పింది-" అంది శ్రీమతి. శ్రీమతిలో నాకు సుజాత కనబడింది.

అప్పుడు కొంత ఆనందమే కలిగింది. సాయంత్రం అవే మాటలు పార్కులో సుజాత నోటివెంట విన్నప్పుడు కలిగిన ఆనందం వర్ణనాతీతం. సుజాతలో నాకు శ్రీమతి కనబడింది.

వయసులో ఉండగా నాకు ప్రియురాలు లేదు. పెళ్ళయ్యాక హనీమూన్ కూడా వెళ్ళలేదు.

అందువల్ల సుజాతతో కబుర్లు నాలో అంతులేని ఉత్సాహాన్ని పుట్టించి పెంచాయి. మేము కలుసుకున్నప్పుడామె నన్నదేపనిగా పొగుడుతూ తొలి సమాగమం కోసం ఎదురుచూస్తున్నట్లు మాటల్లో సూచనప్రాయంగా తెలియజేసేది.

నేను కలగనడం లేదనీ, సుజాతతో ఏర్పడిన పరిచయం వాస్తవమనీ రూఢి అయ్యేక నాలో తీవ్రమైన సంఘర్షణ బయల్దేరింది. నా శ్రీమతికి అన్యాయం చేస్తున్నాననీ, పుత్రరత్నంముందు తలెత్తుకోలేననీ నాలో బెంగ మొదలైంది. కానీ ఒక అపూర్వమైన అవకాశాన్ని చేజార్చుకోలేక క్రమంగా నా మనసు సుజాతమీదకు లాగుతోంది.

నాలోని మార్పు నా ఆంతరంగిక మిత్రుడు సుదర్శనం కనిపెట్టినట్లేవున్నాడు. గోరింటాకు పెట్టిన రోజునుండీ కారణాలడుగుతూనే ఉన్నాడు.

కొన్నాళ్ళు దాటవేసినా - సుజాతకు నాపై పుట్టిన ప్రేమ అందించిన గర్వంతో - ఒక రోజతడికి జరుగుతున్న కథ చెప్పాను. అప్పటికతడేమీ అనలేదు.

రెండ్రోజుల తర్వాత అతడు ఆరాతీసి చేరవేసిన వివరాలు నన్నాశ్చర్యపరిచాయి.

సుజాత ఓ కుర్రాణ్ణి ప్రేమించింది. వాడికింకా ఉద్యోగంలేదు. ఉద్యోగం దొరికేదాకా వాడామెను పెళ్ళిచేసుకోలేడు. ఆమెకింకా పంతొమ్మిదేళ్ళే కదా అని తల్లితండ్రులింకా పెళ్ళి సంబంధాలు చూడ్డంలేదు. కాబట్టి ఆమె నిశ్చింతగా ఉంది. ఈలోగా నేను నా కొడుకు ప్రస్తావన తెచ్చాను.

ఈ సంబంధం తల్లిదండ్రులదాకా వెడితే నిశ్చయం కావడం గ్యారంటీ అని సుజాతకర్థమై వెంటనే నాతోనే ప్రేమ నాటకాన్నారంభించింది.

ఈ నాటకాన్ని కొనసాగించడానికామె ప్రియుడి సహకారం తీసుకుంది. కాస్త దూరానే ఉండి పార్కులో మా మధ్య జరిగేదంతా సుజాత ప్రియుడు గమనిస్తున్నాడు. ఈ వ్యవహారం వాళ్ళిద్దరూ ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడ సుజాత తన అమ్మమ్మ దగ్గరుంటూ కాలేజీలో చదువుతోంది కాబట్టి ఈ ప్రేమనాటకం సాగుతోంది. విషయం అమ్మమ్మకు తెలిస్తే సుజాత ఆటలుకడతాయి.

నేనీవివరాలు విని, "నాతో ఆ పిల్ల పచ్చిగా మాట్లాడిందంటే ఎంతో కొంత మోజుండదంటావా?" అన్నాను. నా ఆశకు ప్రాణం పోయాలని!

"నీకు వయసు యాభై అయినా చూడ్డానికి అరవై ఏళ్ళవాడిలా ఉన్నావు. ఆడది సిగ్గుపడాలంటే ఈడు, జోడు కుదరాలి. సుజాత నిన్ను చూసి రొమ్ము విరుచుకుని తిరిగిందే తప్ప నిండుగా పైట కప్పుకుని సిగ్గు పడిందా? ఇన్నేళ్ళొచ్చినా ఆడదాని మనసు గురించి ఈ మాత్రం తెలుసుకోలేకపోయావా? సుజాత నిన్ను తనకు జోడుగా గుర్తించలేదు. అందుకే నీ దగ్గర సిగ్గుపడడం లేదు" అంటూ సున్నితంగా మందలించాడు సుదర్శనం.

నిజానికి నాకు బుద్ధి రావాలి కానీ అప్పుడు కోపం మాత్రం వచ్చింది. వెంటనే సుజాత ఆట కట్టించాలనుకున్నాను. ఆమె చిరునామా నాకు తెలుసు. అది పట్టుకుని ఆ సాయంత్రం కాస్త పెందలాడే ఆమె ఇంటికి వెళ్ళాను.

ఆ సమయానికి సుజాత ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయి. సుజాత, ఆమె అమ్మమ్మ చెరో కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

గుమ్మంలో నన్ను చూడగానే సుజాత కలవరపడింది.. లేచి నిలబడినప్పుడు

జారిపడిన చున్నీని కూడా అందుకోకుండా బెదురుచూపులు చూసింది.

ఆమె అమ్మమ్మకూడా చటుక్కున లేచి నిలబడి పైట చెంగు భుజం చుట్టూ తిప్పుకుని, సిగ్గుతో తలవంచుకుని, "ఎవరో అడగవే!" అంది.

"ఆడది సిగ్గుపడాలంటే ఈడు, జోడు కుదరాలి!" అన్న సుదర్శనం మాటలు చప్పున నా చెవిలో గింగురుమన్నాయి.

✦ ✦ ✦